సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం : 28 : డిసెంబర్ : 2023

కాలానికి ఎదురీదిన కర్షకులు

సిరిసిల్ల: నేలనే నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతులను ప్రకృతి నిండా ముంచేసింది. 2023వ సంవత్సరంలో యాసంగిలో కురిసిన వడగండ్ల వానతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఎదురైంది. వర్షాకాలం పంటలు రైతులను ఆదుకున్నాయి. మొత్తంగా ఈ సంవత్సరం రైతులకు ఓ పంట తీపినిస్తే.. మరో పంట చేదునిచ్చింది. వర్షాకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురవడంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. భూగర్భజలాలు రికార్డుస్థాయిలో పైకి చేరాయి. 2023వ సంవత్సరంలో రైతులు మిశ్రమ ఫలితాలు చూశారు. – వివరాలు 8లో...



న్యూస్‌రీల్

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


పూజలు చేస్తున్న మంత్రి పొన్నం తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని వరదవెల్లి గుట్టపై వెలసిన దత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పూజలు చేశారు. బ్యాక్ వాటర్‌లో బోటు మీదుగా ఆలయానికి చేరుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. 365 రోజులు గుట్టపైన గల ఆలయంలోకి వెళ్లేందుకు బోటు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కొందరు నాయకులు పదవీకాలం ముగిసే సమయంలో అమలుకాని హామీలు ఇస్తున్నారని, వారిని ఎవరూ నమ్మబోరన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, బోయిని ఎల్లేశ్, నాగుల వంశీ, గుంటి జలందర్, అర్చకులు రత్నాకరశర్మ ఉన్నారు.

'బద్దిపోచమ్మ నిర్వాసితుల బాధలు తీర్చండి'


విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

వేములవాడ: రాజన్న భక్తుల సౌకర్యార్థం తమ ఆస్తులను దేవస్థానానికి అప్పగించి చాలా రోజులు గడుస్తున్నా తమకు రావాల్సిన ఉద్యోగాలు, షాపులు ఇంకా ఇవ్వడం లేదంటూ బద్దిపోచమ్మ గుడి నిర్వాసితులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. బుధవారం వేములవాడలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే ఆలయ అధికారులు, దేవాదాయశాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నేరెళ్ల తిరుమల్‌గౌడ్, మధు రాధాకిషన్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రవీందర్

రుద్రంగి(వేములవాడ): ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ పేర్కొన్నారు. రుద్రంగి మండలం మానాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉంటే జీవితంలో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీవో సుచరిత, హెడ్‌మాస్టర్ రామకృష్ణ, బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు బొడ్డు గంగరాజు, రాజూరి రమేశ్, డీ హబ్ కార్యదర్శి త్రివేణి, సఖీ లీగల్ ప్రతినిధి అంజలి, లోక్ అదాలత్ సభ్యులు రామరాజు, లీగల్ ఎయిడ్ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలిమెట్టు ఎంతవరకు వచ్చింది

- డీఈవో రమేశ్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): తొలిమెట్టులో విద్యార్థులు ఎంత వరకు నేర్చుకున్నారు, విద్యార్థులలో కనీస సామర్థ్యాలను గుర్తించారా.. అని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ఆరా తీశారు. మండలంలోని చీకోడు, మద్దికుంట ప్రైమరీ స్కూళ్లను బుధవారం తనిఖీ చేశారు. డీఈవో పలువురు విద్యార్థులతో మాట్లాడారు. వారిచేత చదివించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న తొలిమెట్టును ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ శైలజ, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రావు, సుధాకర్, వేణుమాధవ్ ఉన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్‌లు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్

- 'ప్రజాపాలనపై నిర్లక్ష్యం వద్దు
- 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తాం
- ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వానికి బాసటగా నిలవాలి
- రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తాం
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మంత్రి ఉత్తమ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా 6 గ్యారంటీలను అమలు చేస్తామని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన గ్రామ, వార్డుసభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతయుతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం చేయొద్దన్నారు. గ్యారంటీల అమలులో ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, ఒక గ్రామంలో ఏర్పాటు చేసిన కౌంటర్ 10 రోజులపాటు ఉంటుందని, దరఖాస్తుదారులు వీలైన రోజు అర్జీలను అందజేయవచ్చని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను డిజిటలైజ్ చేయాలన్నారు.

ఫాంలను ముందే ఇవ్వండి

దరఖాస్తు ఫాంలను ముందుగానే ఇస్తే లబ్ధిదారులు వాటిని నింపి, తీసుకొస్తారని, ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, తోపులాట జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నీటిపారుదలశాఖ ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రేషన్‌బియ్యం రీసైక్లింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కరీంనగర్ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాజన్నసిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్ కుమార్, చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

దరఖాస్తులను తిరస్కరించవద్దు : మంత్రి పొన్నం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశాం. మిగతా నాలుగింటిని తప్పకుండా అమలు చేస్తాం. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ఏ ఒక్క దరఖాస్తును అధికారులు తిరస్కరించవద్దు.

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యం : మంత్రి శ్రీధర్‌బాబు

పేదల ముఖంలో చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద రోజుల్లో అమలు చేసి చూపిస్తాం. అధికారులు ప్రతీ కౌంటర్ వద్ద నిర్లక్ష్యరాస్యుల కోసం సహాయకులను నియమించాలి. ప్రజలు అధిక సంఖ్యలో వస్తే టోకెన్లు ఇవ్వాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నల వర్షం

- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ సంజయ్‌కుమార్, పాడి కౌశిక్‌రెడ్డిలు అందరి కంటే ముందే వచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అధికారులతో వేదిక కింద కూర్చున్నారు.
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇది వరకు అర్జీ పెట్టుకున్నవారు మళ్లీ చేసుకోవాలా? అని ప్రశ్నించడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. వారు అర్హులేనని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. పెంచిన పింఛన్లనూ అందిస్తామని పేర్కొన్నారు.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి అధికారులు అడ్డు చెబుతున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో మాట్లాడి, చెబుతామని అన్నారు.
- సమావేశానికి మాజీ మంత్రులు, సిరిసిల్ల, కరీంనగర్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్ గైర్హాజరయ్యారు.

నల్లనేలపై ఎర్రజెండా


గెలుపుతో ఏఐటీయూసీ నాయకుల సంబరాలు

- 'గుర్తింపు' ఎన్నికల్లో ఏఐటీయూసీ ఆధిపత్యం
- ఐఎన్‌టీయూసీతో హోరాహోరి పోరు
- ప్రాభవం కోల్పోయిన టీబీజీకేఎస్


గోదావరిఖనిలో ఏఐటీయూసీ నాయకుల గెలుపు సంబరాలు



ఏఐటీయూసీ జెండా

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం కోసం బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ ముందంజలో నిలిచింది. సింగరేణి గుర్తింపు కార్మిసంఘం ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు బుధవారం అర్ధరాత్రి దాకా కొనసాగింది. తొలుత బోణీ కొట్టిన ఐఎన్‌టీయూసీ ఆరు ప్రాంతాల్లో, ఏఐటీయూసీ ఐదు ఏరియాల్లో విజయం సాధించి ప్రాతినిధ్యం దక్కించుకున్నాయి. అయితే, అత్యధిక ఓట్లు సాధించిన ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఆవిర్భవించింది. సింగరేణిలోని 11 ఏరియాల్లో 13 కార్మిక సంఘాలు పోటీచేయగా కేవలం సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ మధ్యే పోటీ కనిపించింది. బుధవారం అర్ధరాత్రి వరకు సాగిన ఓట్ల లెక్కింపు వివరాలు ఇలా.. ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం కార్పొరేట్, ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, రామగుండం 3, భూపాలపల్లిలో ఏరియాలో ప్రాతినిధ్యసంఘంగా గెలుపొందింది. ఇక ఏఐటీయూసీ యూనియన్ రామగుండం -1, రామగుండం -2, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా మొత్తం 5 చోట్ల విజయం సాధించింది. మొత్తానికి సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ విజయబావుటా ఎగురవేసింది. పోటీచేసిన 11 స్థానాల్లో ఐఎన్‌టీయూసీకి 6 స్థానాల్లో మొత్తం: 14,215 ఓట్లు రాగా, ఏఐటీయూసీకి 5 స్థానాల్లో మొత్తం 16,177 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఓట్లు ఇతర యూనియన్లు పంచుకున్నాయి. కాగా, గత రెండు పర్యాయాలు పోలింగ్‌లో సత్తా చాటిన టీబీజీకేఎస్ ఈసారి ఎన్నికల్లో పూర్తిగా డీలా పడిపోయింది.

రెండు ఏరియాల్లో ఏఐటీయూసీదే విజయం

రామగుండం రీజియన్‌లో బుధవారం నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రెండు ఏరియాల్లో విజయం సాధించింది. ఒక ఏరియాలో ఐఎన్‌టీయూసీ గెలుపొందింది. రామగుండం రీజియన్‌లో మూడు ఏరియాలు ఉండగా అందులో రెండింటిలో ఏఐటీయూసీ జయకేతనం ఎగురవేసింది. ఆర్జీ–1 ఏరియాలో 5,044 ఓట్లు పోల్‌కాగా అందులో 1,983 ఓట్లు సాధించి ఏఐటీయూసీ విజయం సాధించింది. 1,566 ఓట్లతో ఐఎన్‌టీయూసీ రెండో స్థానంలో నిలిచింది. ఆర్జీ-2 ఏరియాలో 3,369ఓట్లు పోల్‌కాగా అందులో 1,357ఓట్లు సాధించి ఏఐటీయూసీ విజయం సాధించగా, ఐఎన్‌టీయూసీ 1,024ఓట్లతో రెండోస్థానంలో నిలిచింది. ఆర్జీ–3 ఏరియాలో 3,612 ఓట్లు పోల్‌కాగా అందులో ఐఎన్‌టీయూసీ 1,360 ఓట్లు సాధించి విజయం కైవసం చేసుకుంది. 1256ఓట్లు సాధించి ఏఐటీయూసీ రెండోస్థానంలో నిలిచింది.

ఓటు బ్యాంకు పెంచుకున్న సీఐటీయూ..

ఈసారి జరిగిన ఎన్నికల్లో రామగుండం రీజియన్‌లో సీఐటీయూ ఓటు బ్యాంకు పెంచుకుంది. మూడు ఏరియాల్లో మంచి గెలిచిన సంఘాలకు పోటీ ఇచ్చింది. మూడోస్థానంలో నిలిచింది.

అందుబాటులో ఉండి.. అభివృద్ధి చేస్తా

'సాక్షి' ఫోన్‌ఇన్‌లో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో పలువురి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సానుకూలంగా స్పందిస్తూ, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచానని, ఈ గెలుపు ప్రజలకే అంకితం చేస్తున్నానన్నారు. వేములవాడను టెంపుల్‌సిటీగా మార్చుతానని స్పష్టం చేశారు. గంటలోపు 32 మంది ప్రశ్నలకు సమాధానం ఇవ్వగా.. సమయం ముగిసిన తర్వాత కూడా 200 మంది వరకు తమ సమస్యలను విన్నవించేందుకు కాల్ చేశారు.

- ప్రశ్న : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో ఉంది. దాన్ని మండల పరిషత్‌లోకి మారిస్తే బాగుంటుంది. ఆరెపల్లి వద్ద రోడ్డు బాగాలేదు?
  – నరెడ్ల కృష్ణారెడ్డి, చెక్కపల్లిరోడ్, వేములవాడ
- ఎమ్మెల్యే : మీ సలహా బాగుంది. ప్రభుత్వ భవనాలన్నీ ఒకే చోటుకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఆరెపల్లి వద్ద రోడ్డును బాగు చేయిస్తాను.
- ప్రశ్న: మూలవాగుపై మూడో బ్రిడ్జి నిర్మించండి.
  – వారాల దేవయ్య, వేములవాడ
- ఎమ్మెల్యే : ప్రస్తుతం రెండో బ్రిడ్జి పనులు చేయిస్తాం. తప్పకుండా ప్రజల రవాణాకు ఇబ్బందులు లేకుండా అధికారులతో చర్చించి మూడో బ్రిడ్జి పనులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
- ప్రశ్న : మా వీధిలో రోడ్డు కూలిపోయింది. డీఎస్పీ ఆఫీస్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. – అశోక్, వేములవాడ 4వ వార్డు
- ఎమ్మెల్యే : 1-9-18 మీ ఇంటి వద్ద కూలిపోయిన రోడ్డును బాగు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచిస్తాను. అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తాం. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి స్పీడ్ బ్రేకర్లు వేయిస్తాం.
- ప్రశ్న : మా మండలానికి మీసేవ కేంద్రం లేదు. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారు.
  – రంజిత్, భీమారం
- ఎమ్మెల్యే: భీమారం మండలం కేంద్రానికి తప్పకుండా మీసేవ కేంద్రం ఏర్పాటు చేయిస్తాం. ఇటీవల జగిత్యాలలో జరిగిన కలెక్టర్ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.
- ప్రశ్న : స్కాలర్‌షిప్ రావడం లేదు. సహాయం చేయండి. – ఎన్నం రవీందర్, హన్మాజీపేట
- ఎమ్మెల్యే : తప్పకుండా మీరు దరఖాస్తు చేస్తే సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి స్కాలర్‌షిప్ ఇప్పించేందుకు కృషి చేస్తాను.
- ప్రశ్న : మల్లపేట రిజర్వాయర్‌లో భూములు కోల్పోయాం, నష్టపరిహారం ఇప్పించండి, ఉద్యోగాలు ఇవ్వలేదు?
  – నక్క నిరంజన్, గణేశ్, మల్కపేట
- ఎమ్మెల్యే : నేను త్వరలోనే ప్రాజెక్టును సందర్శిస్తాను. తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను. పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తాను. ఉద్యోగాల విషయం ప్రభుత్వ యోచనలో ఉంది.
- ప్రశ్న: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి, అర్బన్ తహసీల్దార్ ఆఫీస్‌లో సిబ్బంది టైమ్ పాటించడం లేదు.
  – సయ్యద్ పాషా, తిప్పాపూర్
- ఎమ్మెల్యే: తప్పకుండా జర్నలిస్టులకు రావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. అక్రిడిటేషన్లు ఇప్పిస్తాను. ఇంటి స్థలాలు ఇప్పిస్తాను. తహసీల్దారు ఆఫీస్‌లో సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులతో మాట్లాడతాను.
- ప్రశ్న : మాది చందుర్తి మండలం. నాకు రావాల్సిన వ్యవసాయ భూమి పేపర్లు రావడం లేదు, ధరణితో నష్టపోయాం.
  – మంగళి రమేశ్, లింగంపేట
- ఎమ్మెల్యే: ధరణితో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి రద్దు చేసి మీలాంటి వాళ్ల ఇబ్బందులను తీర్చుతాం. ఇది ప్రజాప్రభుత్వం.
- ప్రశ్న : మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించండి. జిల్లా కేంద్రం నిజామాబాద్‌కు బస్సు నడిపించండి. – సాయికృష్ణ, రామన్నపేట,
  సాయికుమార్, వట్టిమల్ల
- ఎమ్మెల్యే : తప్పకుండా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తాను. నిజామాబాద్‌కు బస్సు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడతాను.
- ప్రశ్న : వేములవాడలో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించండి? – శ్రీకాంత్, వేములవాడ
- ఎమ్మెల్యే: ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్, సంబంధితశాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
- ప్రశ్న : కలికోట-సూరమ్మ చెరువు పూర్తి చేయించండి. మిర్చి రైతులకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి.
  – గోపాల్‌రెడ్డి, సిరికొండ
- ఎమ్మెల్యే: ఈ ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడ్డాను. ప్రజలతో కలసి అనేక కార్యక్రమాలు నిర్వహించాను. తప్పకుండా ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు బాసటగా నిలుస్తాం. కలెక్టర్‌తో ఇటీవల సమావేశంలో చర్చించాం. మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తా.
- ప్రశ్న : మేడిపల్లిలో జూనియర్ కాలేజీ, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి.
  – గంగారెడ్డి, మేడిపల్లి
- ఎమ్మెల్యే : మేడిపల్లిలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయిస్తా. ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొస్తా.
- ప్రశ్న : కోనరావుపేటను రెండు మండలాలుగా ఏర్పాటు చేయండి. – నగేశ్, వట్టిమల్ల
- ఎమ్మెల్యే : ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు రెండు మండలాలుగా చేసేందుక కృషి చేస్తా.

కొత్తగా సహకార క్రాంతి పథకం

- సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ
- టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ అర్బన్: కస్టమర్లను ఆకర్షించడానికి, డిపాజిట్లను పెంచడానికి కరీంనగర్ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్ (కేడీసీసీబీ) కొత్తగా సహకార క్రాంతి పథకాన్ని ప్రారంభించిందని టెస్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను బుధవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. సాధారణ ప్రజ లకు, సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచామని, తక్షణమే అమలులోకి వస్తాయన్నారు. 18 నెలల కాలానికి(546 రోజులు) మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి సాధారణ ప్రజలకు 7.5 శాతం వడ్డీ రేటు, సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ రేటు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, డీసీసీబీ శాఖల్లో పొదుపు చేయాలని సూచించారు. అనంతరం 2024 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్, డైరెక్టర్లు ముప్పాల రాంచందర్‌రావు, మోహన్ రెడ్డి, స్వామిరెడ్డి, కమలాకర్, మోహన్ రావు, గోపాల్‌రావు, గిరి శ్రీనివాస్, రవీందర్ గౌడ్, నరేశ్‌రెడ్డి, నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి, టీఎస్‌సీఏబీ ప్రత్యేక ఆహ్వానితులు శ్రీనివాస్‌రావు, సీఏ రమేశ్, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి జూడో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా విద్యాశాఖ, పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజులపాటు కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో 67వ రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రావు, పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పాత 10 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, మేనేజర్లు, 20 మంది టెక్నికల్ అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వారికి భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 20 విభాగాల్లో 80 పతకాలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జనవరి 3 నుంచి పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



మైక

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–19 బాలబాలికల రైఫిల్ షూటింగ్ పోటీలకు కరీంనగర్‌లోని నారాయణ జూనియర్ కళా శాల విద్యార్థి కె.మైక ఎంపికయ్యాడు. బుధవారం నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ షూటింగ్ రేంజ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎయిర్ రైఫిల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ రెడ్డి తెలిపారు.

ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్‌గా దేవసేన


దేవసేన

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి పదిరోజుల పాటు నిర్వహించనున్న 'ప్రజాపాలన' కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎ.దేవసేనను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. 'ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహణ, ఇతరత్రా కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమించింది.

క్లుప్తంగా

మాజీ ఎంపీపీకి పరామర్శ


వెంకటేశ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

వేములవాడరూరల్: మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. వెంకటేశ్ తండ్రి నారాయణ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. దీంతో వారి సొంతూరు వేములవాడరూరల్ మండలం వట్టెంలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్ఫూర్తి పురస్కారం ప్రదానం


అవార్డు అందుకుంటున్న శంకరయ్య

వేములవాడఅర్బన్: అటల్ బిహారివాజ్‌పేయి జయంతి సందర్భంగా వేములవాడకు చెందిన సీనియర్ జర్నలిస్టు పంపరి శంకరయ్యకు ఏబీ వాజ్‌పేయి స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీలో శిఖరం ఆర్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. స్థానిక పార్టీ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, సూడిద రాజేందర్, రాజునాయక్, చెన్నిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని సాయిబాబా ఆలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దినపత్రిక విలేకరి శ్యామంతుల అనిల్‌కుమార్ గాయపడ్డాడు. గాయపడ్డ అనిల్‌కుమార్‌ను స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డిపేట నుంచి దుమాల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న అనిల్‌కుమార్‌ను ఎదురుగా వస్తున్న దుమాలకు చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు వేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో గాయపడ్డ అనిల్‌కుమార్‌ను ఆస్పత్రిలో పలువురు పరామర్శించారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా దేవరాజు



సిరిసిల్లటౌన్: వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశం నియామకపు పత్రం అందించారు.

బకాయిలు చెల్లించాలి


సిరిసిల్లటౌన్: మిషన్ భగీరథ కార్మికులకు బకాయిలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్ల కార్మిక భవనంలో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కారు పదేళ్లలో మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు గుర్తించలేదన్నారు. నాయకులు మిషన్ రాజు, తిరుపతి, నరేశ్, రాజు పాల్గొన్నారు.

కాలానికి ఎదురీదిన కర్షకులు

- యాసంగిలో అకాల వర్షం
- కలిసొచ్చిన వర్షాకాలం
- జిల్లాలో రికార్డు స్థాయిలో సాగు
- నిండిన జలాశయాలు
- ఉబికి వచ్చిన భూగర్భ జలాలు

2023 రివైండ్

నేలను.. నింగిని నమ్ముకుని ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు 2023వ సంవత్సరం తీపి, చేదు అనుభవాలను మిగిల్చింది. రేయింబవళ్లు కష్టపడే కర్షకులకు మిశ్రమ ఫలితాలే దక్కాయి. ఈ ఏడాది సంవృద్ధిగా వర్షాలు పడడంతో జలాశయాలు నిండాయి. చెరువులు.. కుంటల్లో నీరు చేరింది. భూగర్భజలాలు రికార్డుస్థాయిలో పైకి చేరాయి. కానీ యాసంగి(రబీ) సీజన్‌లో కురిసిన వడగండ్ల వానలతో రైతులు చేతికొచ్చిన పంటలను కోల్పోవాల్సి వచ్చింది. ధీడపీడలతో తెల్లబంగారం నల్లగా మారింది. యాసంగిలో కోతకొచ్చిన వరి పొలం నేలపై వాలిపోయింది. గింజలు పొలంలోనే లొకలొచ్చాయి. వెరసి జిల్లాలో అన్నదాతలు మిశ్రమ ఫలితాలను అనుభవించారు. ఇలా 2023లో కర్షకులు కాలానికి ఎదురీదారు.


మధ్యమానేరు జలాశయంలో నిల్వ ఉన్న నీరు.


రాలిన మామిడి కాయలు(ఫైల్)


మల్కపేట రిజర్వాయర్ కింద వరినాట్లు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో రికార్డు స్థాయిలో పంటలు సాగుచేశారు. వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 2,40,038 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అత్యధికంగా వరిపంటను 1.62 లక్షల ఎకరాల్లో సాగుచేయగా.. రెండోస్థానంలో పత్తి పంట సేద్యమైంది. ఇతర పంటలను ఈ ఏడాది బాగానే సాగుచేశారు. జిల్లాలో వానాకాలం రికార్డు స్థాయిలో పంటలను వేశారు. పత్తి పంట కొనుగోలుకు జిల్లాలో ఐదు జిన్నింగ్ మిల్లులు ఉండగా.. ప్రైవేటుగానే ఎక్కువగా పత్తి కొనుగోళ్లు సాగుతున్నాయి. ఈ ఏడాది మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్‌లో ధర ఉండడంతో రైతులు పత్తిని అమ్మకుండా ఇళ్లలోనే నిల్వ చేశారు.

కొంపముంచిన అతివృష్టిజిల్లాలో విస్తారంగా పంటలు సాగుచేశారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా సాయం అందిస్తామని హామీ ఇచ్చినా పరిహారం చెల్లించలేదు. పంట నష్టపోయిన రైతులు గుండెల నిండా బాధతో దిక్కులు చూశారు. కౌలురైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సొంతంగా ఉన్న కొద్దిపాటి భూమికి తోడుగా మరి కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగుచేయగా.. నోటికాడి బుక్క నేలపాలైనట్లు అకాల వర్షాలతో పంటలు నేల పాలయ్యాయి. కౌలు రైతులు రెండు విధాలా నష్టపోయారు. అటు కౌలుడబ్బులు చెల్లించాలి. ఇటు పెట్టుబడి పెట్టిన డబ్బులు చేతికి రాక.. చేసిన శ్రమ నేలపాలైన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వపరంగా హెక్టారుకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించి ఏమీ ఇవ్వలేదు. జిల్లాలో బాధిత రైతులు పడిగాపులు కాశారు.

జలం.. పుష్కలం

ఒకప్పుడు జిల్లాలో సాగునీటి కోసం రైతులు భగీరథ ప్రయత్నాలు చేసేవారు. జిల్లాలో వెయ్యి అడుగుల లోతు బోరు వేసినా చుక్కనీరు రాని పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా నీటి ఊటలు పెరిగిన జిల్లాగా రాజన్న సిరిసిల్లకు పేరొచ్చింది. దేశంలో శిక్షణ పొందే ఐఏఎస్‌లకు రాజన్న సిరిసిల్ల జిల్లా భూగర్భజలాల పెంపు పాఠ్యాంశంగా మారింది.

జిల్లాలో జలాశయాలు... నీటి లభ్యత ఇలా..	
మిడ్‌మానేరు	25.458 టీఎంసీలు
ఎగువ మానేరు	2.25 టీఎంసీలు
మల్కపేట	3.10 టీఎంసీలు
నిమ్మపల్లి మూలవాగు	01 టీఎంసీ
సింగసముద్రం చెరువు	0.5 టీఎంసీ

యాసంగిలో పంటనష్టం ఇలా..	
పంటనష్టం	6,490 ఎకరాలు
వరి	5,671 ఎకరాలు
పత్తి	819 ఎకరాలు
నష్టం జరిగిన గ్రామాలు	135
నష్టపోయిన రైతులు	4,171
పంట నష్టం	రూ.3,28,51,000

బోయినపల్లి వద్ద మధ్యమానేరు జలాశయం, గంభీరావుపేట వద్ద ఎగువమానేరు, కోనరావుపేటలో మూలవాగు, జిల్లెల్లలో నక్కవాగు వంటి జలాశయాలు నిండడంతో పాతాళ గంగమ్మ పైకి వచ్చింది. జిల్లాలో 666 చెరువులు ఉండగా.. 458 చెరువులు పూర్తిగా నిండాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 845.4 మిల్లీమీటర్లు కాగా.. ఈ ఏడాది 954 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో శాస్త్రీయంగా భూగర్భ జలాలను అంచనా వేసేందుకు డిజిటల్ వాటర్ లెవల్ రికార్డర్ (డీడబ్ల్యూఎల్‌ఆర్) ఏర్పాటు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో రైతులు కాలానికి ఎదురీది పంటలు పండించారు. వానాకాలంలో జిల్లాలో 3.76 లక్షల మెట్రిక్ టన్నుల వరి పంటను పండించి జిల్లాలోని రైతులు రూ.750.83 కోట్ల దిగుబడులు సాధించారు. మొత్తంగా జిల్లా రైతులు ప్రతికూల పరిస్థితుల్లో పంటదిగుబడిని సాధించి జిల్లా ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారు.

దళితబంధుతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే కేటీఆర్
- హరిదాస్‌నగర్‌లో పెట్రోల్‌బంక్ ప్రారంభం
- ముస్తాబాద్‌లో అయ్యప్ప పడిపూజకు హాజరు


పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న కేటీఆర్


అయ్యప్ప ఆలయంలో కేటీఆర్ పూజలు

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/గంభీరావుపేట(సిరిసిల్ల): దళితబంధుతో లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కేటీఆర్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్‌లో దళితబంధు లబ్ధిదారులు 9 మంది ఒక యూనిట్‌గా ఏర్పడి రూ.1.40కోట్లతో ఏర్పాటు చేసుకున్న పెట్రోల్‌బంక్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం హరిదాస్‌నగర్‌లో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు నూతన గృహప్రవేశం, గొల్లపల్లి సర్పంచ్ పాశం సరోజన నూతన గృహ ప్రవేశాలకు హాజరై అభినందించారు. గొల్లపల్లిలోని పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వరదవెల్లి సాయిచరణ్‌గౌడ్ వివాహానికి, రాచర్లబొప్పాపూర్‌లోని మొడుసు ప్రశాంత్‌రెడ్డి వివాహానికి హాజరయ్యారు. మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి కుమారుడి వివాహం ఇటీవల జరుగగా.. నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన సింగిల్‌విండో భవనం, కార్యాలయాన్ని పరిశీలించారు. ఆధునిక హంగులతో నిర్మించారని చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని అభినందించారు. జెడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ, జిల్లా గ్రంథాలయం చైర్మన్ శంకరయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా ముస్తాబాద్

ముస్తాబాద్ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోందని ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో అయ్యప్ప పడిపూజ మహోత్సవానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ చీటి జితేందర్‌రావు 18వ శబరియాత్ర సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. పోతుగల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు నాని గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఇటీవల కరెంట్‌షాక్‌తో మృతిచెందిన జంగ శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. సెస్ పరంగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతోపాటు తన వ్యక్తిగతంగా రూ.2లక్షల చెక్కును అందజేశారు. బందనకల్ సర్పంచ్ వెంకటేశ్వరి భర్త ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచులు సుమతి, కిషన్‌రావు, గౌతంరావు, రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు రాజేందర్‌రెడ్డి, బాపురావు, ఎంపీటీసీలు బాలకిషన్, రామచంద్రారెడ్డి, సంతోష్‌రావు, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేట మండలంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం పర్యటించారు. పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అదే విధంగా ఎంపీటీసీ నాగారపు భాగ్య కుటుంబాన్ని, శ్రీగాథలో మాజీ సర్పంచ్ మాణిక్యరావు కుటుంబాలను కేటీఆర్ పరామర్శించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు సన్నద్ధం

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడంతోపాటు ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనకు గురువారం నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ప్రజాపాలన ఏర్పాట్లపై సమీక్షించారు. నియోజకవర్గాలు, మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గానికి ఆర్డీవో ఆనంద్‌కుమార్, వేములవాడకు ఆర్డీవో మధుసూదన్‌రెడ్డిలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని కేటాయించినట్లు చెప్పారు. ఒక్కో మండలానికి రెండు బృందాలను.. ఒక టీంకు ఎంపీడీవో, మరో టీంకు తహసీల్దార్ ఇన్‌చార్జిగా ఉంటారని తెలిపారు. ఒక్కో బృందం రోజుకు రెండు గ్రామ సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటి సభ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండోసభ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు అందజేస్తారు. ఒక కుటుంబం ఒక దరఖాస్తు మాత్రమే చేసుకునేలా ఫారాలు తయారు చేశారు. సదస్సు నిర్వహించే గ్రామంలో ఒక రోజు ముందుగా దండోరా వేయించేలా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. జనాభాను బట్టి కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, మహిళలకు, పురుషులకు, వయోవృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఉంటాయని వివరించారు. ఇతర అర్జీలకు జనరల్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గడువు ముగిసిన మరుసటి రోజు కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

- జాబితాలో పేర్లు లేని వారికి ప్రాధాన్యత ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్
- కలెక్టరేట్ ముందు ధర్నా


ధర్నా చేస్తున్న డబుల్ ఇళ్ల దరఖాస్తుదారులు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో కొత్తగా అధికారంలో కొలువుదీరిన కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు వెంటనే నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట డబుల్‌బెడ్‌రూమ్ రాని బాధితులతోపాటు ధర్నా చేపట్టి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని పదేళ్లు ఎదురుచూపులు చేయించిందని విమర్శించారు. డబుల్‌బెడ్రూం జాబితాలో పేర్లు రాని అర్హులైన పేదలకు వెంటనే నివేశనస్థలాలు ఇవ్వాలని, స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. గతంలో సిరిసిల్లలో డ్రాలో పేర్లు వచ్చిన 112 మందికి రగుడులో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సూరం పద్మ, బెజుగం సురేశ్, గోవిందు లక్ష్మణ్, మోర తిరుపతి, దాసరి రూప, చందుపట్ల పోచమల్లు, లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ హెచ్చుతగ్గులతో గృహోపకరణాలు దగ్ధం

- ఎల్లారెడ్డిపేటలో కాలిన కంప్యూటర్లు, టీవీలు
- రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం
- తరచూ ఇదే సమస్యతో ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి కరెంట్ సరఫరాలో లో, హై వోల్టేజీ సమస్య తలెత్తడంతో మెయిన్ రోడ్డు ఇరుపక్కల గల ఇళ్లలోని కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. దీంతో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఇటీవల తరచూ విద్యుత్ మోటార్లు కాలిపోవడమే కాకుండా కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులతో గృహోపకరణాలు కూడా కాలి బూడిదవుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత సెస్ అధికారులకు పట్టింపులేకుండా పోయింది. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌లోని తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం రాత్రి మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న గృహ వినియోగదారులకు సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సాంకేతిక కారణం వల్లే ఈ సమస్య వచ్చినట్లు సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. నష్టపోయిన బాధితులను సెస్ తరఫున ఆదుకోవాలని కోరుతున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా భిక్షపతి


భిక్షపతి

కోనరావుపేట(వేములవాడ): ఎమ్మార్పీఎస్ జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడిగా కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన ఎలగందుల భిక్షపతి ఎన్నికైనట్లు జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి తెలిపారు. తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏబీవీపీ ఫోరం కన్వీనర్‌గా ప్రశాంత్


సామనపల్లి

సిరిసిల్లటౌన్: ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ వింగ్ కన్వీనర్‌గా సామనపల్లి ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సమావేశాల్లో ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ అన్నల్‌దాస్ మురళి ప్రకటించారు. తన నియామకంపై స్పందిస్తూ విద్యారంగ సమస్యలపై పోరాడుతానని ప్రశాంత్ ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు గాయపడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలకేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ కేసీఆర్‌కాలనీలో నివసించే దొంత ఎల్లవ్వ స్థానిక సాయిబాబా గుడి నుంచి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలిని స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల తుది ఖర్చులు సమర్పించాలి

- వ్యయ ప్రత్యేకాధికారి స్వప్న

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు తుది ఖర్చులు సమర్పించాలని ఎన్నికల వ్యయ ప్రత్యేకాధికారి స్వప్న కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల తుది ఖర్చుల సమర్పణపై అభ్యర్థులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ ప్రత్యేకాధికారి స్వప్న మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత 30 రోజుల్లో అభ్యర్థులు తుది ఖర్చుల వివరాలను అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించకపోతే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10(అ) ప్రకారం తదుపరి ఎన్నికల్లో పోటీకి అనర్హులు అవుతారని వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి 15, సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించి 15 మంది అభ్యర్థులు, వారి తరఫున వ్యక్తులు హాజరయ్యారు. అభ్యర్థులు అఫిడవిట్‌తో సహా సమర్పించాల్సిన విధానంపై కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. జనవరి 2వ తేదీ వరకు అభ్యర్థులు షెడ్యూల్‌తోపాటు మూడు సెట్ల బిల్లులు క్యాండిడేట్స్ సంతకంతో సమర్పించాలని సూచించారు. మరోసారి ఈనెల 29న కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, వ్యయ పరిశీలకుల సమక్షంలో అభ్యర్థుల అకౌంట్‌ల రికన్సిలేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నోడల్ అధికారి రామకృష్ణ, ఎన్నికల అకౌంటింగ్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేయాలి


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని కార్మికభవనంలో బుధవారం నిర్వహించిన బద్దం ఎల్లారెడ్డి 45వ వర్ధంతికి హాజరయ్యారు. అనంతరం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కారును, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. దేశంలో బీజేపీ మతం మత్తును ప్రజల్లోకి వదులుతూ స్వార్థ రాజకీయాలకు పాల్పడటం శోచనీయమన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ కార్యకర్తలు, నాయకులు బీజేపీని ఓడించేలా పనిచేయాలన్నారు. బద్దం ఎల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాములు, లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా పడిపూజ మహోత్సవం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ధర్మశాస్త్రనగర్ శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల పడిపూజ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, 18వ శబరియాత్ర చేస్తున్న చీటి జితేందర్‌రావు పదునెట్టాంబడి పూజ ఉత్సవాలను రాజుగురుస్వామి ఆధ్వర్యంలో కేరళ తాంత్రి ఉన్నికృష్ణన్ నంబూద్రి నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు అన్నదానం చేయగా, ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్ అల్పాహారం అందించారు. రాత్రి పద్దెనిమిది మెట్లపై జితేందర్‌రావు జ్యోతులు వెలిగించారు.

